క్లుప్తంగా

ఘనంగా దాశరథి శత జయంతి



జడ్చర్ల: పట్టణంలోని డాక్టర్ బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం దాశరథి కృష్ణమాచార్య శత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిజాం వ్యతిరేక కవిత్వంతో తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిగా నిలిచిన గొప్ప సాహితీవేత్త దాశరథి కృష్ణమాచార్య అని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నర్మద, తెలుగుశాఖ అధ్యక్షుడు నర్సింహులు, అధ్యాపకులు శ్రీనివాసులు, రాఘవేంద్రరెడ్డి, కళ్యాణి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో అల్లర్లు సృష్టిస్తే సహించం



మహబూబ్‌నగర్ క్రైం: రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎవరైనా సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే సహించమని రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానికంగా గొడవలు, అలర్లు సృష్టించరాదన్నారు. అనంతరం ముందస్తు చర్యలో భాగంగా మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

బినామీలతో ‘ఉపాధి’ పనులు



హన్వాడ: ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. అధికారులు ఆలస్యంగా రావడంతో మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో ప్రారంభమైన సామాజిక తనిఖీ ప్రజావేదిక.. రాత్రి వరకు కొనసాగింది. ముందుగా వేపూర్, కొనగట్టుపల్లి, మాధారం తదితర గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను చాలా వరకు బినామీలతో చేయించినట్లు వెల్లడైంది. దీనికి తోడు మస్టర్లలో పేర్లు కూడా నమోదు చేయకుండా బిల్లులు డ్రా అయ్యాయని తనిఖీ బృందం బహిర్గతం చేశారు. ఉపాధి పనుల్లో జరిగిన గోల్‌మాల్‌పై ఏపీడీ ముసాయిదా, ఈజీఎస్ డీవీఓ హేమలత ఆగ్రహం వ్యక్తంచేశారు. మొత్తం 35 గ్రామాల్లో జరిగిన పనులపై చర్చ జరగాల్సి ఉండటంతో బుధవారం కూడా ప్రజావేదిక కొనసాగనుందని తెలిపారు. సమావేశంలో ఈజీఎస్ అంబ్రుస్‌మన్ సంతోష్‌కుమార్, ఎంపీడీఓ యశోద, ఏపీఓ హైమావతి, సోషల్ ఆడిట్ బృందం ఎస్‌ఆర్పీ రాఘవులు తదితరులు ఉన్నారు.

ఇచ్చిన ప్రతి హామీ అమలు



మహమ్మదాబాద్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆముదాలగడ్డ తండా, నంచర్ల, దేశాయిపల్లి, కొలిమికుచ్చే తండా, వెంకట్‌రెడ్డిపల్లి, జూలపల్లి, సంగాయిపల్లి, ధర్మాపూర్, ముందలితండా, షేక్‌పల్లి గ్రామాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కేఎం.నారాయణ, మాజీ ఎంపీపీ శాంతిబాయి, మాజీ వైస్‌ఎంపీపీ రాధారెడ్డి పాల్గొన్నారు.

మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని మైసమ్మ ఆలయంలో మంగళవారం ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మైసమ్మ చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

నిలిచిన రిజిస్ట్రేషన్లు

జడ్చర్ల: మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్లాట్ బుక్ చేసుకొని సుదూర ప్రాంతాల నుంచి వచ్చామని.. తీరా తహసీల్దార్ లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు జరగలేదని పలువురు వాపోయారు. కాగా, లోకాయుక్తలో కేసు ఉండటంతో తాము అక్కడికి వెళ్లామని.. తదుపరి ప్రత్యేక సమావేశం ఉండటంతో కార్యాలయానికి హాజరు కాలేదని తహసీల్దార్ నర్సింగరావు తెలిపారు.



గౌరిదేవిపల్లి సమీపంలో మత్తడి దుంకుతున్న పెద్దవాగు చెక్‌డ్యాం

పెద్దవాగుకు జలకళ

- ఎగువ నుంచి భారీగా వరద
- మత్తడి పోస్తున్న చెక్‌డ్యాంలు

అడ్డాకుల: మండలంలోని పెద్దవాగు జలకళ సంతరించుకుంది. మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో వాగుకు భారీగా వరద వస్తోంది. నిన్న, మొన్నటి వరకు చుక్క నీరు లేక బోసిపోయి కనిపించిన పెద్దవాగుకు మంగళవారం నుంచి మూసాపేట మండలంలోని పోలకంపల్లి మీదుగా వరద మొదలైంది. తిమ్మాపూర్, తాళ్లగడ్డ, మహ్మదుస్సేన్‌పల్లి, నిజాలాపూర్, సంకలమద్ది, కొమిరెడ్డిపల్లి, అడ్డాకుల మండలంలోని గౌరిదేవిపల్లి మీదుగా కందూర్ వైపు పారుతోంది. మూసాపేట, నిజాలాపూర్, సంకలమద్ది, గౌరిదేవిపల్లి శివారుల్లో నిర్మించిన చెక్ డ్యాంలు మత్తడి పోస్తున్నాయి. ఎగువ నుంచి వరద ఇదే విధంగా వస్తే కందూర్ స్టేజీ వద్ద ఉన్న చెక్‌డ్యాం దాటి పొన్నకల్, గుడిబండ, రాచాల, ముత్యాలంపల్లి, బలీదుపల్లి మీదుగా వనపర్తి జి ల్లా మదనాపురం మండలంలోని సరళాసాగర్ ప్రాజెక్టుకు నీరు చేరనున్నాయి.వర్షాలకు తోడు కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు పెద్దవాగుకు వచ్చి చేరుతుండటంతో వరద పోటెత్తుతోంది.

అన్నదాతలకు ఊరట..

మూసాపేట, అడ్డాకుల మండలాల్లో చెరువులు, బోరుబావులపై ఆధారపడి రైతులు పంటలు పండిస్తారు. జూలై చివరి వారం సమీపిస్తున్నా పెద్దవాగుకు వరద రాకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద ప్రారంభం కావడం రైతులకు ఊరట కలిగిస్తోంది. కొమిరెడ్డిపల్లి శివారులోని చెక్‌డ్యాం నుంచి పొన్నకల్, రాచాల చెరువుకు గొలుసుకట్టు కాల్వ ద్వారా వరద నీరు వెళ్తున్నాయి. వాగులో వరద పారడంతో బోరుబావుల్లో సైతం భూగర్భజలమట్టం పెరగనుంది. వరిపంట సాగు చేయడానికి తుకాలు పోసిన రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

నిండుకుండల్లా చెరువులు

భూత్పూర్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. మద్దిగట్ల మద్దిగాన్ చెరువుతో పాటు ఎల్కిచర్ల, కొత్త మొల్గర చెరువుల్లోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతోంది. కప్పెట సమీపంలోని చెరువుకు కాల్వల ద్వారా నీరు వస్తుండటంతో అలుగు పారింది.



అలుగు పారుతున్న కప్పెట చెరువు

ఎమ్మెల్యే హామీతో దీక్ష విరమణ

మహబూబ్‌నగర్ రూరల్: ఇందిరమ్మ రాజ్యంలో దళిత బిడ్డలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలం ఏనుగొండ రెవెన్యూ గ్రామంలో కొన్నేళ్లుగా సాగుచేస్తున్న భూములపై తమకు హక్కు కల్పించాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. మంగళవారం దీక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి దళితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో దీక్షలను విరమించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయం

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యాభివృద్ధికి జేపీఎన్‌సీఈ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎఫ్‌సెట్ ఇంజినీరింగ్ విభాగంలో 10వేల లోపు ర్యాంక్ సాధించి జేపీఎన్‌సీఈలో సీటు పొందిన మహ్మద్ సాకేబు, హుస్నా ఫాతిమాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అభినందించారు. జేపీఎన్‌సీఈ తరఫున విద్యార్థులకు రెండు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. అదే విధంగా నెక్స్‌వేవ్ శిక్షణ సంస్థలో ట్రెనింగ్ కోసం ఓ విద్యార్థికి రూ. 40వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్ ప్రిన్సిపాల్ పి.కృష్ణమూర్తి, సందీప్‌కుమార్, గురురాఘవేందర్‌రెడ్డి, వెంకటేశ్, సయ్యద్ ముస్తాక్‌అలీ, నగేశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: దివిటిపల్లి డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు డిమాండ్ చేశారు. మంగళవారం దివిటిపల్లి డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివిటిపల్లి రైల్వేస్టేషన్ నుంచి డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతర్గత సీసీరోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.రాజ్‌కుమార్, కడియాల మోహన్, భాను ప్రసాద్, కళావతి, శంకరమ్మ, నాగమణి, వెంకటేశ్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

జడ్చర్ల: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం స్థానిక ఎస్వీపీ నగర్‌కు చెందిన బీమేష్ ఆచారి (49) గూడ్స్ రైలు కింద పడి మృతిచెందాడు. అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా.. లేక ప్రమాదవశాత్తు రైలుకింద పడి మృతిచెందడా అన్న విషయంపై విచారణ చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఐజాక్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని మండల విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు సందీప్, రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కురుమూర్తిస్వామి ఆలయ ఈఓ గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కురుమూర్తి స్వామి ఆలయం వద్ద భక్తులకు మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆలయం వద్ద మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, విడిది సత్రాల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయం వద్ద అధిక ధరలకు టెంకాయల విక్రయాన్ని అరికట్టాలని కోరారు. కొందరు ఆకతాయిలు ఆలయ రాజగోపురం వద్ద మద్యం తాగి అసంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కురుమూర్తి స్వామి గోవుల సంరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, నాని తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ఈఓ గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యూరియా కోసం తప్పని క్యూ

నవాబుపేట: యూరియా కోసం రైతన్నలకు వెతలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద యూరియా కో సం నిత్యం బారులు దీరుతున్నారు. అధికారు లు రోజువారీగా కొంత మొత్తంలో యూరి యా బస్తాలను పంపిణీ చేస్తుండటంతో ఎగబడ్డారు. మంగళవారం 600 బస్తాల యూరియాను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

యూరియా కొరత లేకుండా చర్యలు

రాజాపూర్: జిల్లాలో యూరియా కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం రాజాపూర్‌లోని రైతు ఆగ్రోస్‌తో పాటు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. జిల్లాకు యూరియా నిరంతరం సరఫరా అవుతుందన్నారు. అయితే కొందరు రైతులు యూరియా దొరుకుతుందో లేదోనని ఒకేసారి అధిక మొత్తంలో నిల్వ చేసుకుంటున్నారని.. అలాంటి పనులు ఎవరూ చేయొద్దన్నారు. పంటల సాగులో యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. సరైన మోతాదులో వినియోగిస్తేనే పంట దిగుబడి వస్తుందన్నారు. డీఏఓ వెంట ఏడీఏ ఆంజనేయులు, ఏఓ ప్రదీప్‌గౌడ్ ఉన్నారు.



నవాబుపేటలో యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

కురుమూర్తి దేవస్థానంలో తీరనున్న నీటి కష్టాలు

చిన్నచింతకుంట: పేదల తిరుపతిగా విరాజిల్లుతున్న అమ్మాపురం కురుమూర్తి స్వామి దేవస్థానంలో నీటి కష్టాలు తీరనున్నాయి. 2లక్షల కిలో లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన మంచినీటి సంపును బుధవారంరాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కలెక్టర్ విజయేందిర బోయి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. కురుమూర్తి స్వామి ఆలయంవద్ద మంచినీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే జీఎంఆర్ మిషన్ భగీరథ పథకం ద్వారా 2లక్షల కిలో లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ సంపు నిర్మాణానికి గతేడాది రూ. 36లక్షలు మంజూరు చేయించారు. సంపు నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టి సంవత్సర కాలంలోనే పూర్తిచేశారు. ఎట్టకేలకు కురుమూర్తిస్వామి దేవస్థానంలో నీటి కష్టాలు తీరుతుండటంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అనుమతుల్లేని ప్రైవేటు స్కూళ్లపై కొరడా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. మర్లులో నూతనంగా ప్రారంభించిన గీతం పాఠశాలను అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని.. పాఠశాల భవనంలోనే ఫంక్షన్‌హాల్, ఇతర దుకాణాలు ఉన్నాయని పలువురు నుంచి ఫిర్యాదులు రావడంతో పాఠశాలను మూసివేసినట్లు డీఈఓ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా కమలానెహ్రూ కాలనీలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న డివైన్ గ్రేస్ పాఠశాలను సైతం మూసివేయాలని ఆర్జేడీ నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఈ పాఠశాల భవనం ఒక చోట ఉండగా.. అనుమతులు మరో భవనానికి ఉన్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు అనుమతులు, సరైన వసతులు లేకుండా నిర్వహిస్తున్న మరో మూడు పాఠశాలలపై కూడా చర్యలు తీసుకున్నట్లు ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ తెలిపారు.

బీసీలపై చిన్నచూపు తగదు

మెట్టుగడ్డ/జడ్చర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా బీసీలు అన్నిరంగాల్లో వెనకబాటుకు గురవుతున్నారని బీసీ మేధావుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రభాకర్ అన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అత్యధిక జనాభాగా ఉన్న బీసీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఫలితంగా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలు వెనకబాటుకు గురవుతున్నారని తెలిపారు. 60శాతం ఉన్న బీసీలు కేవలం 7శాతం ఉద్యోగాలు చేస్తుండగా.. 15శాతం ఉన్న అగ్రకులాల వారు 81శాతం ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఇదెక్కడి న్యాయమో ప్రభుత్వాలే తేల్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ మేధావుల సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, రాంచందర్‌జీ, శ్రీనివాస్, రాజేశ్వరి, కల్పన, జ్యోతి, గాయత్రి పాల్గొన్నారు.

❖ పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టి 42శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని బీసీ జాగృతిసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన బీసీ జాగృతిసేన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించడం హర్షనీయమని.. పార్లమెంట్‌లో బిల్లుపెట్టి రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు నర్సింహులు, విజయ్‌కుమార్, శేఖర్, గోపాల్ ఉన్నారు.



జ్యోతిరావు పూలే విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న బీసీ మేధావుల సంఘం నాయకులు

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

అడ్డాకుల: బ్యాంకు ఖాతాదారులు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ సూచించారు. మూసాపేట మండలం జానంపేటలో మంగళవారం టీజీబీ మూసాపేట బ్రాంచ్ ఆధ్వర్యంలో ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచితులు ఫోన్‌చేసి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సామాజిక భద్రతా పథకాలైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఖాతాదారుడు పొదుపు పద్ధతులు పాటించాలన్నారు. బ్యాంకు ద్వారా పొందిన రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే కలిగే లాభాలను వివరించారు. బ్యాంకులో బీమా చేయించుకుని మరణించిన వారి కుటుంబ సభ్యులకు బీమా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఐసీ నోడల్ ఆఫీసర్ మహేశ్వర్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ అనంత జ్యోతి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, ఎఫ్ఎల్‌సీ కౌన్సెలర్ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీమా చెక్కులు పంపిణీ చేస్తున్న టీజీబీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ

జాతీయ సైక్లింగ్ పోటీలకు పాలమూరు విద్యార్థినులు

మహబూబ్‌నగర్ క్రీడలు: వచ్చే నెలలో జరిగే జాతీయస్థాయి మహిళా సైక్లింగ్ పోటీలకు జిల్లా కేంద్రంలోని రాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ముగ్గురు ఎంపికై నట్లు పీఈటీ పుష్ప బుధవారం తెలిపారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో జరిగిన అస్మితా రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ సైక్లింగ్ లీగ్‌లో 5 కి.మీ. రోడ్ స్పీడ్ సైక్లింగ్ పోటీల్లో 9మంది పాఠశాల విద్యార్థినులు పాల్గొనగా.. ప్రణతి ప్రథమ, గీతిక ద్వితీయ, జూనియర్ బాలికల 10 కి.మీ. విభాగంలో జ్యోతి ఏడో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. వీరిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థినులను జీహెచ్ఎం అంజలిదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

నవాబుపేట: సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారి అశోక్‌రాజ్ సూచించారు. మంగళవారం మండలంలోని కాకర్లపహాడ్‌లో ఓ వ్యక్తి చికున్‌గున్యా బారిన పడ్డాడు. సమాచారం అందుకున్న వైద్యాధికారులు, సిబ్బంది గ్రామానికి చేరుకొని సదరు వ్యక్తి ఇంటి పరిసరాలతో పాటు పాఠశాల, సమీపంలోని వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అనంతరం వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా నివారణాధికారి మాట్లాడుతూ.. జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించడంతో పాటు ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట వైద్యసిబ్బంది రాములు, జయశీల, విజయ, శరభలింగం, రమణ, శ్రీనివాస్, రజిత, జ్యోతి, పద్మ పాల్గొన్నారు.

బోనం.. సమర్పయామి





రాజాపూర్ మండలం తిర్మలాపూర్‌లో బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు

అమ్మా బైలెల్లినాదో.. తల్లి బైలెల్లినాదో అంటూ జిల్లావ్యాప్తంగా మంగళవారం పోచమ్మ బోనాల ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తమ కుటుంబాలను చల్లగా చూడు తల్లి అంటూ గ్రామ దేవతకు బోనం సమర్పించారు. జిల్లా కేంద్రంతో పాటు హన్వాడ మండలంలోని గొండ్యాల్, చిర్మల్‌కుచ్చతండాల్లో జరిగిన బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దేవరకద్రలో బోనాల ఊరేగింపు కనులపండువగా జరిగింది. పోతరాజులు, శివసత్తుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అదే విధంగా భూత్పూర్ మండలం గోప్లాపూర్, రాజాపూర్ మండలం తిర్మలాపూర్, హన్వాడ మండల కేంద్రంతో పాటు పెద్దదర్పల్లి, నవాబుపేట మండలం కూచూర్, దొడ్డిపల్లి, దేపల్లి గ్రామాల్లో భక్తులు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయాలకు చేరుకొని ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



దేవరకద్ర పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



సద్దలగుండులో బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



నవాబుపేట మండలం దొడ్డిపల్లిలో..



దేవరకద్రలో..



భూత్పూర్ మండలం గోప్లాపూర్‌లో..



హన్వాడ మండలం పెద్దదర్పల్లిలో..